క్లుప్తంగా

నాయకుల మధ్య ఘర్షణ

చిట్యాల: మండలంలోని చింతకుంట రామయ్యపల్లిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో మొదలైన గొడవ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణకు దారి తీసింది. సమాచారం అందుకున్న చిట్యాల సెకండ్ ఎస్సై శాఖాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఇరుపార్టీల నాయకులను వెళ్లగొట్టారు. కాగా ఈ దాడిలో సర్పంచ్ మధువంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిజ్జం వేణుకు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు మడికొండ రవీందర్‌రావు, దేవేందర్‌రావులకు గాయాలు అయ్యాయి. దీంతో వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకుని మెరుగైన వైద్యం కోసం పరకాల, వరంగల్ ఆస్పత్రులకు తరలివెళ్లారు. ఈ దాడిపై ఇరు వర్గాలకు చెందిన నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గ్రామానికి చెందిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండలంలోని గట్లకనిపర్తి, పెద్దకోడెపాక, జోగంపల్లి, కొప్పుల గ్రామాల్లో శనివారం ఆమె పాదయాత్ర చేశారు. అనంతరం కొప్పుల గ్రామంలో మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెప్రకృతివనం, వైకుంఠధామాలు, నర్సరీ, డంపింగ్‌యార్డు నిర్మాణాలు చేపట్టారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ నాగపూరి రాజమౌళిగౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు వెన్నంపల్లి పాపయ్య, నాయకులు రాయరాకుల మొగిలి, రాంచంద్రం, రమణారెడ్డి, రవికిరణ్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, విజయ్, శివ, రాజు, నాగరాజు, స్వరూప, శిరీష పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



మల్హర్: మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు సరిత శ్రీనివాస్‌తో పాటు 30 మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, సర్పంచ్ కుమారస్వామి, సీనియర్ నాయకుడు కోట రవి, వాల యాదగిరిరావు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో పలువురు..



మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మడప సమ్మయ్యతో పాటు బీజేపీ నాయకుడు తాటి పోచయ్య శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇనుగొండ వెంకట్‌రెడ్డి, దుర్గయ్య, తాటి లచ్చయ్య, రాజబాపు, రాజు ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఎస్ఎస్‌తాడ్వాయి : ఐఎన్‌టీయూసీ తాడ్వాయి మండల అధ్యక్షుడిగా బండారి శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే సీతక్కకు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకత్వానికి బండారి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్‌ముదిరాజ్, సీనియర్ నాయకుడు అరెం లచ్చుపటేల్, సర్పంచ్ ఇర్ప సునిల్ దొర, గోవిందరావుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నర్సయ్య, సాధు చక్రపాణి ఉన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



మొగుళ్లపల్లి: పూజలు చేస్తున్న మహిళలు



చిట్యాల: అన్నదానం చేస్తున్న సభ్యులు

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏడోరోజు అమ్మవారు శాఖాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శివాలయం దగ్గర కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదలను అందజేశారు. అలాగే కుంకుమర్చన హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోటె ధర్మారావు, ఎంపీటీసీ ఎర్రబెల్లి వనితపున్నంచందర్‌రావు, శివరామకృష్ణ భజనమండలి సభ్యులు పంచాయతీ పాలకవర్గం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా దేవా రాజేశ్వరీ–వీరన్న దంపతుల ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా దుర్గామాత ఏడవ రోజు మహాశక్తి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్నాదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దేవా సతీష్, శ్రీధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లిలో..

బతుకమ్మ పండుగ సందడి



టేకుమట్లలో జనాల రద్దీ

టేకుమట్ల: ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించే పండుగల్లో సద్దుల బతుకమ్మ, దసర ప్రధాన పండగలు ముఖ్యమైనవి. నేడు(ఆదివారం) సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా శనివారం మండల కేంద్రం వ్యాపార సముదాయాలు, పూల వ్యాపారుల వద్ద ప్రజలు కిక్కిరిసిపోయి ముందు రోజే పండగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ పూల రాశులతో ప్రధాన రోడ్డు అలంకరించినట్లు కనువిందు చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు జనాలతో రద్దీగా నిండుకుని వాహనాల రాకపోకలకు కాస్త అంతరాయం కలిగింది.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

మొగుళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల సర్పచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నేడు(ఆదివారం) నిర్వహించనున్న సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలో జరుగనున్న మొగుళ్లపల్లి–ముల్కలపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు, చిన్నవాగుల మధ్య ఉన్న పచ్చని మైదానంలో సద్దుల బతుకమ్మకు ఇరు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో డోజర్‌తో భూమిని చదును చేశారు. వాగులోకి దిగి బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీలుగా దారి చేయించారు. దారి పొడవునా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు.

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని తాళ్లపాడులో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను సర్పంచ్ మేడబోయిన అశోక్‌తో కలిసి స్థానిక ఎస్సై చల్ల రాజు పరిశీలించారు. బతుకమ్మ విగ్రహం వద్ద మహిళలు ఆటలాడిన అనంతరం సమీపంలోని లింగయ్యకుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారని అశోక్ వివరించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై సూచించారు. గ్రామ పంచాయతీ వద్ద జరిగే దసరా ఏర్పాట్లను పరిశీలించి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మొగుళ్లపల్లిలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



వెంకటాపురం(ఎం)లో..

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట : పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో రేణికుంట్ల కుమార్, కోఆప్షన్ సభ్యుడు కొమ్ముల సతీష్, బీజేపీ బూత్ అధ్యక్షుడు కొమ్ముల రమేష్, గ్రామ అధ్యక్షుడు ముక్కెర నితీన్, ఎస్సీమోర్చా అధక్షుడు ముక్కెర చిన్న సదయ్య, బీజేపీ గ్రామ కార్యదర్శి దొమ్మాటి రాజయ్యతో పాటు 30 మంది చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డివె వైస్ ఎంపీపీ లతాలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ స్వాతి, హుస్సేన్‌పల్లి సర్పంచ్ రజిత, గ్రామ అధ్యక్షుడు సుమన్, మాజీ సర్పంచ్ రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సదయ్య, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల మహేందర్, సదానందం పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహదేవపూర్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కమ్మల రమేష్ (26) అదృశ్యమైనట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ రెండు రోజుల కింద ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవాడంతో తండ్రి మల్లయ్య శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెన్సిల్, చాక్‌పీస్‌పై బతుకమ్మలు

- తొమ్మిది రకాల బతుకమ్మలను తయారు చేసిన రజనీకాంత్



పెన్సిల్ లిడ్‌పై అతి చిన్న బతుకమ్మ



రజనీకాంత్ తయారు చేసిన తొమ్మిది రకాల మైక్రో బతుకమ్మలు



రజనీకాంత్

కాటారం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శణమైన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెన్సిల్ గ్రాఫైట్‌పై, చాక్‌పీస్‌లపై అతి చిన్న పరిమాణంలో బతుకమ్మ ఆకృతిని రూపొందించి అబ్బురపర్చారు కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాలకు చెందిన ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్. మూడు రోజుల పాటు శ్రమించి మూడు మిల్లీమీటర్ల ఎత్తు, రెండు మిల్లీమీటర్ల వెడల్పుతో పెన్సిల్ గ్రాఫైట్‌పై బతుకమ్మను తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. అంతేకాకుండా తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగకు సంబంధించి తొమ్మిది రకాల బతుకమ్మ ఆకృతులను పెన్సిల్ గ్రాఫైట్, చాక్‌పీస్, పెన్సిల్ ఉడ్‌లపై చైనాక్లేతో వివిధ ఎత్తుల్లో తయారు చేసినట్లు పేర్కొన్నారు. చాక్‌పీస్‌లపై మొదటి బతుకమ్మ 1.5 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటర్ వెడల్పు, 2వ బతుకమ్మ 1.2 సెంటీమీటర్ల ఎత్తు, ఒక సెంటీమీటర్ వెడల్పు, 3వ బతుకమ్మ 1 సెంటీమీటర్ ఎత్తు, 9 మిల్లీమీటర్ల వెడల్పు, 4వ బతుకమ్మ 8మిల్లీమీటర్ల ఎత్తు, 8 మిల్లీమీటర్ల వెడల్పు ఏర్పాటు చేశారు. అలాగే పెన్సిల్‌పై 5వ బతుకమ్మను 3.8సెంటీమీటర్ల ఎత్తు, 6మిల్లీమీటర్ల వెడల్పు, 6వ బతుకమ్మను 1.3సెంటీమీటర్ల ఎత్తు, 2 మిల్లీమీటర్ల వెడల్పు, 7వబతుకమ్మ చాక్‌పీస్‌పై 5మిల్లీమీటర్ల ఎత్తు, 6 మిల్లీమీటర్ల వెడల్పు, 8వ బతుకమ్మ చాక్‌పీస్‌పై 4.5 సెంటీమీటర్ల ఎత్తు, 1 సెంటీమీటర్ల వెడల్పు, 9వ బతుకమ్మ ప్రపంచంలోనే అతిచిన్న బతుకమ్మ పెన్సిల్ లిడ్‌పై 3మిల్లీమీటర్ల ఎత్తు 2మిల్లీమీటర్ల వెడల్పుతో తయారు చేశారు. తన ఆర్ట్స్ ద్వారా రజనీకాంత్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ తయారు చేసిన సూక్ష్మ ఆకృతులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయం



కార్యకర్తలకు కండువాలు కప్పుతున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టంకట్టడం ఖాయమని గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం రాత్రి భూపాలపల్లి మండలంలోని కమలాపూర్, న్యూలంబడి తండా, అముదాలపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజా దీవెన యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలిపిస్తే పోడు భూములు దున్నుకునే రైతులకు పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల భయం పట్టుకుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీలన్నింటినీ అమలు చేస్తామని తెలిపారు. పలు గ్రామాల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షుడు సుంకరి రాంచంద్రయ్య, రూరల్ మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రంజిత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పడం ఖాయం

పదేళ్లుగా మోసం చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని గణపురం మండలం నగరంపల్లి, జంగుపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడుతున్న నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని సత్యనారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న సతీష్‌గౌడ్

టేకుమట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, రాష్ట్ర ప్రజలు తప్పకుండా కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా భూపాలపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు గెలుపును ప్రజలు ఎప్పుడో నిర్ణయించారని తెలిపారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజల మధ్యకు వచ్చి మాయమాటలు చెప్పే మాటలను నమ్మరాదని, నిరంతరం ప్రజల కోసం పని చేసే వ్యక్తిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఓట్ల కోసమే రాజకీయం చేసే ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న నాయకులు



గోవిందరావుపేటలో..

చిట్యాల: మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామానికి చెందిన కుందూరు భగవాన్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల హనుమకొండలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతి రెడ్డి శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కూర మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కాల్వ సమ్మిరెడ్డి, కొక్కుల సదానందం, తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన మాలోత్ మోతిలాల్ శనివారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు నూనావత్ మహేష్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మోతిలాల్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఆయన వెంట నాయకులు రాంచందర్, రమేష్, లక్ష్మణ్, వెంకటేష్, చిన్నా నాయక్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పీఆర్వోకు..

ములుగు : జెడ్పీ చైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శాసనసభ అభ్యర్థి బడే నాగజ్యోతి పీఆర్వో జంగిలి రవితేజను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు శనివారం పరామర్శించారు. డబుల్ టైఫాయిడ్, డెంగీ విష జ్వరంపై ఆరా తీశారు. సీనియర్ నాయకుడు గంద్రకోట సుధీర్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చిట్యాల: ములుగు జిల్లా జంగాలపల్లికి చెందిన ధరమ్‌సోత్ నగేష్ అనే వ్యక్తి.. ఈ నెల 15న చిట్యాలకు వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి అతడికి శనివారం ఎస్సై జంగిలి రమేష్ చేతుల మీదుగా నగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సురేందర్, కోమలను ఎస్సై అభినందించారు. అనంతరం నగేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రమేష్

విస్తృతంగా వాహనాల తనిఖీ



చిట్యాల: కారును తనిఖీ చేస్తున్న ఎస్సై శాఖాన్



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ శివారులో ఎస్సై ఎండీ.శాఖాన్ సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికల దృష్ట్యా ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాహనాలలో ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది లింగన్న, అస్లాంజానీ ఉన్నార

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద స్థానిక ఎస్సై అశోక్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారి వివరాలు, సామగ్రి, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు.

సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు

వాజేడు : మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై శనివారం వెంకటాపురం (కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు.శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దన్నారు. సివిల్ పోలీసులు ఉన్నారు.



వెంకటాపురం(కె)లో..

'బూటకపు హామీల బీఆర్ఎస్‌ను ఓడించాలి'

శాయంపేట : ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నోటిఫికెషన్‌లు విడుదల చేసి మళ్లీ రద్దు చేయడం కేసీఆర్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. ఉద్యోగాల కోసం అప్లై చేసిన నిరుద్యోగ యువత లక్షల రూపాయాలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారని అన్నారు. కానీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. నిరుపేద బిడ్డలను బలిగొంటున్న బీఆర్ఎస్‌ను ఓడించి భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్, జిల్లా నాయకులు రజిని యాదవ్, లక్ష్మణ్, చంటి, అనిల్, సాయిగౌడ్, కిరణ్ ప్రసాద్ పాల్గొన్నారు.